ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన

వికారాబాద్, మార్చి 20 : జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు బాధ్యతతో పని చేయాలని, వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను సూచించారు. బుధవారం ఐడీవోసీ సమావేశపు హాలులో సెక్టోరల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో వీవింగ్ సర్వేలైన్స్ బృందాలతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 16న విడుదల అయినందున.. అప్పటి నుంచి జూన్ 6 వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్, నిబంధనలు అమల్లోకి వచ్చాయన్నారు. జిల్లా అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, సెక్టోరల్, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలైన్స్ టీం బాధ్యతలను తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, ఎస్ఎస్టీ 6, మూడు షిఫ్టులలో 24/7 పర్యవేక్షణ చేస్తుంటాయని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధుల నిర్వహణ చేయాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా కేటాయించిన బృందాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఆర్వోలు నిఘా బృందాల పర్యవేక్షణ చేయాలన్నారు. ఏఆర్వోలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాలపరంగా, భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ చేయాలన్నారు. మీ పరిధిలో పర్మిషన్ లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు జరగడానికి వీలు లేదన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం-12డిలను ఇంటింటికీ అందజేసి రసీదు తీసుకోవాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలి

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారులు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీంలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి పోలీస్, రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్రమ నగదు, లిక్కర్, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 6 ఎఫ్ఎస్టీ, 6 ఎస్ఎస్టీ, 2 టీములు ఏర్పాటు చేసినట్లు, 24 గంటల నిఘా ఉంచినట్లు తెలిపారు. సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెలగాలన్నారు. అనుమానిత రవాణా పట్ల చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రచార సామగ్రిపై ప్రచురణకర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసే సమయంలో అన్ని నియమ నిబంధనలను పాటించాలని వివరించారు.

ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వీరకాంతం, రాంరెడ్డి ఎన్నికల నిర్వహణపై శిక్షణనిచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్‌డీవో వాసుచంద్ర, జడ్పీ సీఈవో సుధీర్, కార్మిక శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పనులపై దృష్టి సారించాలి

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జరిగే పనులపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తక్కువ శాతం పనులు జరుగుతున్న గ్రామాల్లో లేబర్ సమావేశాలు నిర్వహించి, లేబర్‌ను సమీకరించి 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ రోడ్లు, లేబర్ మొబిలైజేషన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 565 గ్రామపంచాయతీల్లో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. ముండ్ల పొదలు క్లియర్ చేయడం, రోడ్లకు సంబంధించి భూమి చదును చేయడం, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసి, పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పరిధిలో పంచాయతీ సెక్రెటరీలను ఇన్వాల్వ్ చేయాలని కలెక్టర్ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ ఉన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

పార్లమెంట్ ఎన్నికలు వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), మీడియా సెంటర్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారులు చెన్నమ్మ, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి పొరపాట్లకూ తావివ్వొద్దు

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యా శాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పూర్తి పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించాలన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత హ్యాండోవర్ చేసే వరకు పరీక్ష సెంటర్ విడిచి వెళ్లకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌వో, సిట్టింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారుల సమన్వయంతో పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. డ్యూటీలో ఉండే ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది మొబైల్ ఫోన్‌లు వాడరాదని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఉండే 80 సెంటర్లలో చెక్ చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పూర్తి ఎస్కార్ట్ తో పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాల తరలింపు జరుగుతుందని తెలిపారు. జూమ్ మీటింగ్‌లో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

మూడు నెలల్లో.. మునుపటి కష్టాలు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతాం
- మీడియా సమావేశంలో గ్రంథాలయ సంస్థ వికారాబాద్ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్
- బీఆర్ఎస్‌లో పదవులను అనుభవించి ఇతర పార్టీలోకి వెళ్లడం విడ్డూరం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

తాండూరు, మార్చి 20 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు సీమాంధ్ర పాలనలో ఎదుర్కొన్న కష్టాలు మొదలయ్యాయని గ్రంథాలయ సంస్థ వికారాబాద్ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్, తాండూరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు పేర్కొన్నారు. బుధవారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రాజుగౌడ్, శ్రీనివాస్‌చారి, నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో ఉన్నత పదవులు అనుభవించిన నాయకులు నేడు పార్టీలు మారడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డికి బీఆర్ఎస్ చక్కటి అవకాశం ఇచ్చి చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే నమ్ముకున్నవారిని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరడం వింతగా ఉందన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న మహేందర్‌రెడ్డి భార్య జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపి తాను కండువా వేసుకోకుండానే బీఆర్ఎస్ సభల్లో పాల్గొంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలతో చేతులు కలిపి రోహిత్‌రెడ్డి ఓటమికి ప్రధాన కారణమయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మోసం చేసిన ద్రోహులను చిత్తుచిత్తుగా ఓడిస్తామన్నారు. బీజేపీ నుంచి బరిలో ఉంటున్న కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కూడా బీఆర్ఎస్‌కు మోసం చేసిన వాడేనని తెలిపారు. ఎన్నికల్లో పార్టీలు మార్చే నాయకులను ప్రజలు నమ్మకుండా చిత్తశుద్ధితో పనులు చేసే నాయకులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీసీ వర్గానికి చెందిన మంచి మనసున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు తాండూరు నియోజకవర్గం నుంచి 30 వేలకు పైగా మెజార్టీ తీసుకు వచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 100 రోజులు గడిచినా చెప్పిన మాటను, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఎద్దేవా చేశారు. సాగునీరు కరువై రైతన్నలు ఇబ్బందులపాలవుతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం 3 ఎకరాలు దాటలేదని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోవాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని వారు కోరారు.

రోహిత్‌రెడ్డి పార్టీ మారే ప్రసక్తే లేదు

తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కొందరు మూర్ఖులు పార్టీ మారుతున్నారని ప్రచారం చేస్తున్నారని.. అలాంటివారికి త్వరలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నెల 27న రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అందుకు పార్టీ నేతలు విధిగా హాజరు కావాలని కోరారు. కులం, మతం ముఖ్యంగా రాముడి పేరుతో రాజకీయం చేసే నేతలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

అంగరంగవైభవంగా..

- రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో శ్రీచక్రం, శ్రీరామ, శివపార్వతుల, సరస్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠ
- శ్రీమాధవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు, అనుగ్రహ భాషణం
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


చిన్నారి పోతుగంటి విహాన్‌కు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతీదేవి, నిర్వాహకులు

కడ్తాల్, మార్చి 20 : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో రామేశ్వర వీరాంజనేయ క్షేత్రం కొండపై గ్రామానికి చెందిన కోర్పోలు లీలమ్మ, లక్ష్మారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నూతన ఆలయాలను నిర్మించారు. బుధవారం గురుమదనానంద సరస్వతీస్వామి పీఠాధీశ్వరులు, మాధవానంద సరస్వతీస్వామి (సిద్ధిపేట్)పర్యవేక్షణలో, వేద పండితులు మెళ్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శ్రీచక్రం, శ్రీరామ, శివపార్వతుల, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, అగ్ని ధ్యానం, ఉక్తహోమం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబస్థాపన, పూర్ణాహుతి, వేదోక్త మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో మాధవానంద సరస్వతీదేవి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణాలతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందని తెలిపారు. భగవంతుడి అనుగ్రహం ఉంటే అంతా మంచే జరుగుతుందని పేర్కొన్నారు. నీలో దాగి ఉన్న వెలుగే భగవంతుడి స్వరూపమని, ప్రతి వ్యక్తి తనలోని పరమాత్ముడిని దర్శించుకోవాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు మన వారసత్వ సంపద అని తెలిపారు. పాప కార్యాలు చేయరాదని, పుణ్య పనులు చేసి భగవంతుడి సేవలో పునీతులు కావాలన్నారు. కారణం లేనిదే ఏ కార్యమూ జరగదని, ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా లీలమ్మ, లక్ష్మారెడ్డి దంపతులకు ఆయన ఆశీర్వాచనాలు అందించారు.

ఎంపీ రాములు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని కలిగి ఉండాలని తెలిపారు. ఈ ప్రాంతంలో సరస్వతీదేవి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

సీఎం సతీమణి గీతారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. సమృద్ధిగా వానలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ కుమారుడు విహాన్‌తో అక్షరాభ్యాసం చేయించారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆధ్మాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణాలతో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమంలో బోధన్, పాలకుర్తి ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, విశ్రాంత ఆచార్యులు వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మమ్మ, కుమార్తె, సోదరులు, కుమారులు, ఆలయ నిర్వాహకులు, ఋత్విక్‌లు భరద్వాజాచార్య, శ్రీనివాసశర్మ, ధరశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లాలో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు

వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

ఎస్పీ కోటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీస్ అధికారులు

సమావేశానికి హాజరైన పోలీసులు

వికారాబాద్, మార్చి 20 : పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లాలో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో కో ఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా చేసిన వార్షిక కార్యక్రమాలు, భవిష్యత్తులో చేయాల్సిన కార్యక్రమాల గురించి సొసైటీ సభ్యులకు అందాల్సిన బెనిఫిట్స్, వెల్ఫేర్‌లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ఎవరైనా మరణించినా, సిబ్బంది రిటైర్మెంట్ సమయంలో, పోలీస్ సిబ్బంది పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రతి సంవత్సరం మెరిట్ స్కాలర్‌షిప్‌లు కో-ఆపరేటివ్ సొసైటీ తరపున ఆర్థిక సహాయం చేయనున్నట్లు వివరించారు. భవిష్యత్తులో కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా తీసుకోవాల్సిన పనులను సొసైటీ బాడీ మెంబర్స్ అందరూ కలిసి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో వికారాబాద్ జిల్లా పోలీస్ తరపున ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రథోత్సవం

నవాబుపేట, మార్చి 20 : మండల కేంద్రంలోని యెల్లకొండ గ్రామంలో పార్వతీ పరమేశ్వరుల రథోత్సవ కార్యక్రమం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా ఆలయ చైర్మన్ పట్లోళ్ల భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10:30 వరకు గ్రామ పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించగా.. వేలాది మంది భక్తులు ఆటాపాటలతో తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. హరహర మహాదేవ శంభోశంకర అనే నామస్మరణలతో యెల్లకొండ పులకించింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ భరత్‌రెడ్డి రథోత్సవానికి సహకరించిన వేద పండితులు, భక్తులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీశైలం, శివకుమార్, అర్చకులు సంతోష్, పూర్ణచందర్, శివప్రసాద్, మణికంఠ, శశి, ఆనందం పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

దవాఖాన ఎదుట ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు

పరిగి టౌన్, మార్చి 20 : వైద్యం వికటించి వ్యక్తి మృతిచెందిన ఘటన పరిగి పట్టణంలో బుధవారం జరిగింది. రోగి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన బంటు శ్రీనివాస్ (29) ఛాతిలో నొప్పి వస్తున్నదని బుధవారం కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే పరిగిలోని ఓ ప్రైవేట్ ఆర్ ఎంపీ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు డాక్టర్ గఫార్ పరీక్షించి కొన్ని మందులు రాసి ఇచ్చాడు. మందులు వేసుకున్న కొద్దిసేపటికే శ్రీనివాస్ దవాఖానలో కుప్పకూలిపోయాడు. పరిస్థితి సీరియస్‌గా ఉందని గ్రహించిన డాక్టర్ వెంటనే సర్కారు దవాఖానకు తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే సర్కారు దవాఖానకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు ఆర్ఎంపీ దవాఖానకు వెళ్లి ఆందోళనకు దిగారు. డాక్టర్ కుటుంబ సభ్యులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య అనిత, 8 నెలల బాబు, రెండు సంవత్సరాల పాప ఉన్నారు. మంచి వ్యక్తిని కోల్పోయామని బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

అందనంత దూరంలో..

- రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- ఇష్టానుసారంగా అమ్ముతున్న వ్యాపారులు
- నిద్రమత్తులో అధికార యంత్రాంగం

ఇబ్రహీంపట్నం, మార్చి 20 : నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో సామాన్యులు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. సంబంధిత అధికారుల ఆజమాయిషీ కొరవడడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలను పెంచుతున్నారు. దీంతో నగర శివారులలోని ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటుతున్నాయి. ఓ వైపు కల్తీ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతుండగా.. మరోవైపు వ్యాపారులు ఇష్టానుసారంగా రేట్లు పెంచి సామాన్యుల నడ్డి విడుస్తున్నారు. ధరల పెరుగుదలపై ప్రశ్నించే నాథుడు లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. బియ్యం ధరలను నియంత్రించడం కోసం ఓ వైపు అధికారులు ప్రయత్నిస్తుండగా.. కిందిస్థాయి వ్యాపారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోగా.. నిత్యావసర వస్తువులకు మాత్రం ధరలకు రెక్కలు వస్తున్నాయి.

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు కోల్డ్ స్టోరేజీలలో చింతపండు, ఉల్లిగడ్డ తదితర నిత్యావసర వస్తువులను పెద్దఎత్తున నిల్వ ఉంచి మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రైసు మిల్లుల్లో బియ్యాన్ని పెద్దఎత్తున అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ధరలు పెంచిన తరువాత వ్యాపారులు కోల్డ్ స్టోరేజీల నుంచి నిల్వలను బయటకు తీస్తున్నారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో 20 నుంచి 30 వరకు కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి.

కూరగాయల విక్రయంలోనూ ఇదే తంతు..

అలాగే, ఓపెన్ మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యవసాయధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లనే ధరలు పెరిగినట్లు వ్యాపారులు వాపోతున్నారు.

చెరువులో పడి ఇద్దరు మృతి

వడ్డె వెంకటేశ్(ఫైల్), గారెల కృష్ణయ్య(ఫైల్)

కొత్తూరు, మార్చి 20 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు మృతిచెందిన సంఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూడూరులో జరిగింది. కొత్తూరు ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. గూడూరుకు చెందిన వడ్డె వెంకటేశ్(40), గారెల కృష్ణయ్య(60) మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో చేపలు పట్టేందుకు గూడూరు పరిధిలోని ఉప్పరోని కుంటకు వెళ్లారు. చెరువులోకి దిగి అందులో జారిపడి మృతిచెందారు. మృతుడు వెంకటేశ్ తల్లి పొన్నమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.